teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్


నేటి వాస్తవాలు... తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 02 | సంచిక : 363 | చీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | సోమవారం | 6 మే 2024 | పేజీలు : 08 | వెల ₹5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.

## విడుదలైన తెలంగాణ స్టేట్ ఎలిజిబిలిటీ టెస్ట్ నోటిఫికేషన్

**ఈ మేరకు ప్రకటన విడుదల చేసిన ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ**




హైదరాబాద్, మే 05 (తీన్మార్ న్యూస్): తెలంగాణ స్టేట్ ఎలిజిబిలిటీ టెస్ట్-2024 అసిస్టెంట్ ప్రొఫెసర్స్, లెక్చరర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్ కోసం అర్హత పరీక్ష కోసం నోటిఫికేషన్ విడుదలైంది. ఈ పరీక్షను ఉస్మానియా యూనివర్సిటీ నిర్వహిస్తుంది. ఈ మేరకు ఉన్నత విద్యాశాఖ

మిగతా 2 లో

# 'సోషల్' వారు.. పార్టీల జోరు

**ఎంపీ ఎన్నికల వేళ.. సోషల్ మీడియాలో దుమ్మురేపుతున్న ప్రచారం**

**గ్రామాలు, నాయకులు, దోస్తుల పేరిట ప్రత్యేక గ్రూపులు**

**ఎంపీ ఎన్నికలు ముంచుకొస్తున్న వేళ సోషల్ మీడియాలో ప్రధాన పార్టీల ప్రచారం హొరెత్తుతోంది. గ్రామాలు, నాయకులు, దోస్తుల పేరిట ప్రత్యేక గ్రూపులు ఏర్పాటు చేసుకుని ప్రచారం విస్తృతం చేస్తున్నారు. ఒకప్పుడు పక్కగ్రామంలో ఏదైనా సంఘటన జరిగితే టీవీల్లో లేదా పత్రికల్లో వస్తేనే తెలిసేది.. నేడు క్షణాల్లో పక్కగ్రామమే కాదు ప్రపంచంలో ఏ మూలన ఏ సంఘటన జరిగినా వెంటనే తెలిసి పోతోంది. దీంతో ప్రధాన పార్టీల నాయకులు సోషల్ మీడియాపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.**

తెలంగాణ బ్యూరో, మే 05 (తీన్మార్ న్యూస్): ఒకప్పుడు ఇంటర్నెట్ వినియోగం అంతంతమాత్రంగానే ఉండేది. ఇప్పుడు ప్రతిపల్లె, గుడిసె ల్లోకి వచ్చి చేరింది. మొబైల్ ఫోన్ లేనివారు గ్రామాల్లో వేళ్లమీద లెక్కపెట్టేవిధంగా మారిందంటే అతిశయోక్తికాదు. ప్రతి ఒక్కరూ స్మార్టుఫోన్ ను ఉపయోగిస్తూ ఇంటర్నెట్ ఆక్టివేట్ కల్గి ఉన్నారు. ప్రస్తుతం స్మార్టు ఫోన్ చేతిలో ఉంటే ప్రపంచాన్నే చుట్టిరావచ్చున్న ధీమాలో ఉన్నారు. దీన్ని

మిగతా 2 లో






## రైతుబంధు సాయం ఎప్పుడు ఇచ్చేది

**నాట్లు వేసే సమయంలో ఇస్తారా.. పంట చేతికి వచ్చిన సమయంలోనా.?**

**సీఎం రేవంత్‌పై బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు ప్రశ్న**

**రైతుబంధు సాయం విషయంలో సీఎం రేవంత్‌పై బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు మరోసారి ప్రశ్నలు సంధించారు. రైతులు నాట్లు వేసే సమయంలో రైతుబంధు ఇస్తారా.. పంట చేతికి వచ్చి ధాన్యం తూకం వేసే సమయంలో ఇస్తారా? అంటూ ధ్వజమెత్తారు. కరీంనగర్ జిల్లా వీణవంకలో జరిగిన బీఆర్ఎస్ బహిరంగ సభలో పాల్గొన్నారు.**

హైదరాబాద్, మే 05 (తీన్మార్ న్యూస్): 'తెలంగాణ మళ్లీ మర్లవడ్డది. తెలిసిపోయింది కదా. మొదటి దెబ్బనే పడే. మొన్న ముఖ్యమంత్రి రైతుబంధు 9వ తారీఖు వరకు వేస్తా

మిగతా 2 లో

## పద్మశ్రీ మొగిలయ్య తెలంగాణకే గర్వకారణం

**మాట ప్రకారమే మొగిలయ్యకు కేటీఆర్ ఆర్థిక సాయం**

తెలంగాణ బ్యూరో, మే 05 (తీన్మార్ న్యూస్): తెలంగాణ జానపద కళాకారుడు, పాలమూరు ముద్దుబిడ్డ పద్మశ్రీ మొగిలయ్యకు సంబంధించిన ఓ వీడియో వైరల్ అవ్వడంతో ఇది తెలంగాణలో పెద్ద కలకలమే రేపింది. దీనిపై వెంటనే స్పందించిన బీఆర్ఎస్ వర్కింగ్

మిగతా 2 లో



## ఎప్‌సెట్ పరీక్షలో 20శాతం ప్రశ్నలు క్లిష్టం

**40శాతం సులభం 40శాతం ప్రశ్నలు మధ్యస్తం**

**కన్వీనర్ ప్రొఫెసర్ డీన్‌కుమార్, కో కన్వీనర్ ప్రొఫెసర్ కే విజయ్‌కుమార్‌రెడ్డి భరోసా**

హైదరాబాద్, మే 05 (తీన్మార్ న్యూస్): ఎప్‌సెట్ పరీక్షలో కేవలం 20శాతం మాత్రమే క్లిష్టప్రశ్నలుండేలా ప్రశ్నపత్రాలను రూపొందిస్తున్నామని, మరో 40శాతం సులభంగా, ఇంకో 40శాతం ప్రశ్నలు మధ్యస్తంగా ఉంటాయని కన్వీనర్ ప్రొఫెసర్ డీన్‌కుమార్, కో కన్వీనర్ ప్రొఫెసర్ కే విజయ్‌కుమార్‌రెడ్డి భరోసానిచ్చారు. ప్రశ్నలు కఠినంగా ఉంటాయేమోనన్న టెన్షన్ విద్యార్థులకు అక్కర్లేదన్నారు. ఈ నెల 7నుంచి 11వరకు

మిగతా 2 లో




## ప్రైవేట్ రంగ జాబితాలో చేరిన ట్రైన్లు

**ట్రైన్లను ప్రైవేట్ రంగం వారు నడిపించడానికి సిద్ధమయ్యారు**

**భారత్ గౌరవ్ యాత్ర పేరుతో ప్రయివేట్ రైలు ప్రారంభం**


**మనం ఇప్పటివరకు ప్రైవేట్ బస్సులు, ప్రైవేట్ విమానాలు, ప్రైవేట్ స్కూల్స్ ఇలా ప్రైవేటువీ ఎన్నో చూసాం. కానీ ఇదే ప్రైవేట్ రంగానికి ట్రైన్లు కూడా వచ్చి చేరాయి. ఇప్పటివరకు ప్రభుత్వ హయాంలోనే నడిచే ట్రైన్లు ప్రైవేట్ రంగం వారు కూడా నడిపించడానికి సిద్ధమయ్యారు.**

ఢిల్లీ, మే 05 (తీన్మార్ న్యూస్): అంతేకాదు ఈ ప్రైవేట్ ట్రైన్ ను ప్రారంభించారు. మరి అది ఎక్కడో వివరాలు ఏంటో చూద్దాం. ప్రిన్సివేలు ట్రావెల్స్ ఇండియన్ రైల్వే సంస్థ వారు భారత్ గౌరవ్ యాత్ర పేరుతో ఒక రైలు

మిగతా 2 లో

## గ్రూప్-1 పోస్టుల భర్తీ రిజర్వేషన్లపై హైకోర్టు కీలక ఆదేశాలు

**ఎస్టీలకు 10% తుది తీర్పునకు లోబడి ఉండాలని హైకోర్టు ఆదేశాలు**



హైదరాబాద్, మే 05 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో గ్రూప్-1 పోస్టుల భర్తీకి సంబంధించిన రిజర్వేషన్లపై రాష్ట్ర హైకోర్టు కీలక ఆదేశాలు జారీచేసింది. గ్రూప్-1 పోస్టుల భర్తీలో ఎస్టీలకు 10% రిజర్వేషన్లు అమలు చేయాలన్న టీఎస్పీఎస్సీ నిర్ణయం తమ తుది తీర్పునకు లోబడి ఉండాలని హైకోర్టు ఆదేశించింది. రాష్ట్రంలో ఎస్టీ రిజర్వేషన్లను 6 నుంచి 10 శాతానికి పెంచుతూ 2022లో ప్రభుత్వం

మిగతా 2 లో



## రేవంత్ రెడ్డి అప్పాయింట్‌మెంట్ లేకపోయేసారికి మోత్కుపల్లి నిరసనలు

**రేవంత్ రెడ్డి మాదిగలకు అన్యాయం చేస్తున్నారని ఆరోపణలు**


తెలంగాణ, బ్యూరో మే 05 (తీన్మార్ న్యూస్): మోత్కుపల్లి నరసింహులు తెలంగాణలో మరో కేఏ పాల్‌ను తలపించే రాజకీయాలు చేస్తున్నారని అంటున్నారు కాంగ్రెస్ నాయకులు. పార్టీలు మారడంలో సిద్ధహస్తుడిగా పేరున్న మోత్కుపల్లి గతంలో టీడీపీలో ఉన్నారు. తనకేదో చంద్రబాబు గవర్నర్ గిరీ ఇప్పిస్తారని హామీ ఇచ్చి.. మోసం చేశారంటూ.. వీరంగం వేశారు. నానా తిట్లూ తిట్టేశారు. తర్వాత బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకుని కేసీఆర్‌ను ఆకాశానికి ఎత్తేశారు. దళితుల పాటి దేవదేవుడంటూ

మిగతా 2 లో

## పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కు వినియోగానికి సాధారణ సెలవు మంజూరు

**ప్రభుత్వ ఉద్యోగులకు ఎన్నికల సంఘం అవకాశం**

**ఎన్నికల విధుల్లో పాల్గొనే ఏ ఉద్యోగీ ఓటు హక్కును కోల్పోకూడదని నిర్ణయం**



2

# పద్మశ్రీ మొగిలయ్య తెలంగాణకే గర్వకారణం

### మొదటి పేజీ తరువాయి

ప్రెసిడెంట్ కేటీఆర్ మొగిలయ్యను ఆదుకుంటానని హామీ ఇచ్చారు. మాట ఇచ్చిన ప్రకారమే ఆదివారం మొగిలయ్యను కలిసిన కేటీఆర్ ఆర్థిక సాయం చేశారు. పద్మశ్రీ మొగిలయ్య.. తెలంగాణకే గర్వకారణం, ఆయన గొప్ప కళాకారుడు అన్న కేసీఆర్.. ఆయన కష్టాల్లో ఉన్నారనీ, ఆయనకు సాయం చెయ్యడంలో తాను ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నానని తెలిపారు.

# ఎప్‌సెట్ పరీక్షలో 20శాతం ప్రశ్నలు క్లిష్టం

### మొదటి పేజీ తరువాయి

ఉద యం, మధ్యాహ్నం రెండు సెషన్లలో ఎప్‌సెట్ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. వారు మాట్లాడుతూ ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే టీఎస్ ఎప్‌సెట్‌కు అన్ని రకాల ఏర్పాట్లు పూర్తిచేసినట్టు తెలిపారు. ఇంటర్‌బోర్డు సహా 15బోర్డులకు చెందిన విద్యార్థులు ఎప్‌సెట్‌కు దరఖాస్తు చేశారని వెల్లడించారు. తెలుగు అకాడమీ పుస్తకాలను ప్రామాణికంగా తీసుకొనే ఎప్‌సెట్‌లో ప్రశ్నలిస్తాం అన్నారు. పూర్తి వివరాలు వారి మాటల్లోనే విద్యార్థులు రెండు గంటల ముందుగానే పరీక్షాకేంద్రాలకు చేరుకోవాలి. 90నిమిషాల ముందు నుంచే పరీక్షాకేంద్రాల్లోకి అనుమతిస్తాం. ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించం. చివరి నిమిషంలో పరీక్షాకేంద్రంలోకి వచ్చే విద్యార్థులు తమ విలువైన సమయాన్ని కోల్పోయినట్టే. వెరిఫికేషన్, బయోమెట్రిక్, కంప్యూటర్ అలాట్‌మెంట్‌కు కనీసం 20 నిమిషాలు పడుతుంది. దీంతో చివరి నిమిషంలో వచ్చేవారు ఈ సమయాన్ని నష్టపోయినట్టే. ఇలాంటి వారికి ఎలాంటి అదనపు సమయాన్ని ఇవ్వం. విద్యార్థులు సాధ్యమైనంత ముందుగానే పరీక్షాకేంద్రాలకు చేరుకోవాలి. ఈ ఏడాది ఎప్‌సెట్‌కు 35 వేలమంది అదనంగా దరఖాస్తు చేశారు. పెరిగిన దరఖాస్తులను దృష్టిలో ఉంచుకుని 20 పరీక్షాకేంద్రాలను పెంచాం. ఇంజినీరింగ్‌కు 166, అగ్రికల్చర్ ఫార్మసీకి 135 పరీక్షాకేంద్రాలను ఏర్పాటు చేశాం. తెలుగు, ఉర్దూల్లో ఏవైనా పొరపాట్లుంటే ఇంగ్లిష్ ప్రశ్నపత్రాలనే ప్రామాణికంగా తీసుకొంటాం. విద్యార్థులు ఇంగ్లిష్ ప్రశ్నలను ఒకటికి రెండుసార్లు చదివి సమాధానం ఇవ్వాలి. విద్యార్థుల సందేహాల నివృత్తికి హెల్ప్‌లైన్లు ఏర్పాటు చేశాం. 74169 23578, 74169 08215 నంబర్లను సంప్రదించవచ్చు.

# ప్రైవేట్ రంగ జాబితాలో చేరిన ట్రైన్లు

### మొదటి పేజీ తరువాయి

ప్రారంభించింది. ఇండియా అంటేనే ట్రైన్లలో ప్రయాణించే ప్రయాణికులు ఎక్కువగా ఉంటూ ఉంటారు. ప్రయాణికులు వారి గమ్య స్థానాలకు ట్రైన్ ద్వారానే చేరుకుంటారు. దీనికి ప్రధాన కారణం రైల్వే ప్రయాణం అంటే సురక్షితం మరియు సౌకర్యం. ఇండియాలో సామాన్య ప్రజల నుంచి సంపన్నుల వరకు ఈ ట్రైన్ ప్రయాణాలు చేయడానికి ఎంతో ఇష్టపడతారు. ఈ రైల్వే సంస్థ భారతీయ రైల్వే మంత్రిత్వ శాఖ కింద నడుస్తూ ఉంటుంది. ట్రైన్లలో టికెట్ తక్కువ సౌకర్యాలు ఎక్కువ కాబట్టి మిడిల్ క్లాస్ వాళ్ళు కూడా ఈజీగా ప్రయాణం చేసుకోవచ్చు. అలాంటి ఈ ప్రభుత్వ ట్రైన్ వ్యవస్థలోకి ఒక ప్రైవేట్ ట్రైన్ కూడా రాబోతోంది. ఇది దేశంలోనే తొలిసారిగా రాబోతున్న ప్రైవేట్ ట్రైన్. కేరళ నుంచి ప్రైవేట్ ట్రైన్ సర్వీస్ మొదలై తిరువనంతపురం వరకు సాగుతుంది. అయితే ఈ ట్రైన్ వ్యవస్థను ఇండియన్ రైల్వే భారత్ గౌరవ్ యాత్ర ప్రాజెక్టులో భాగంగా (ఎస్ఆర్ఎంపిఆర్) గ్లోబల్ రైల్వేస్ ప్రైవేట్ లిమిటెడ్ తో కలిసి ప్రిన్సి వరల్డ్ ట్రావెల్స్ ద్వారా ఈ కొత్త రైల్వే సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు. మరి ఈ ట్రైన్ లో సకల సౌకర్యాలు ఉంటాయట. ఇందులో ఒకేసారి 750 మంది ప్రయాణం చేయవచ్చు. ఇందులో రెండు స్లీపర్ క్లాస్ బోగీలు, రెండు సెకండ్ క్లాస్ ఏసీ కోచ్ లు, అలాగే 11 థర్డ్ క్లాస్ ఏసీ కోచ్లు ఉంటాయట. ఇందులో 60 మంది సిబ్బంది, వైద్య నిపుణులు కూడా ఉంటారట. అంతేకాకుండా ఈ రైలులో వైఫై, జీపీఎస్ ట్రాకింగ్ సిస్టం, ఆహారం వంటి ఎన్నో సౌకర్యాలు ఉన్నాయట. ఇందులో ఏసి స్లీపర్ లో నాలుగు రోజుల గోవా ట్రిప్ కొరకు ఒక్కొక్కరికి 14 వేలు చెల్లించాలి. త్రీ టైర్ ఏసీ అయితే 15000 చెల్లించాలి. ఇలా ట్రైన్ బోగిని బట్టి రేటు ఉంటుంది. ఈ ట్రైన్ ఎక్కువగా వారణాసి అయోధ్య ప్రయోగరాజ్ వంటి యాత్ర స్థలాలకు నడుస్తుందట.

# గ్రూప్-1 పోస్టుల భర్తీ రిజర్వేషన్లపై హైకోర్టు కీలక ఆదేశాలు

### మొదటి పేజీ తరువాయి

ఉత్తర్వులు (జీవో నెం. 33) జారీచేసిన సంగతి తెలిసిందే. అయితే ఈ జీవోకి అనుగుణంగా గ్రూప్-1 పోస్టుల్లో ఎస్టీ రిజర్వేషన్లను 10 శాతానికి పెంచుతూ ఈ ఏడాది ఫిబ్రవరి 19న తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా కమిషన్ తీసుకున్న ఈ నిర్ణయాన్ని సవాలు చేస్తూ ఇద్దరు వ్యక్తులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్పై విచారణలో భాగంగా పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ ప్రభుత్వ నిర్ణయం వల్ల మొత్తం రిజర్వేషన్లు 54 శాతానికి పెరిగాయని, ఇది సుప్రీంకోర్టు తీర్పునకు వ్యతిరేకమని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు 50 శాతానికి మించడం అనేది రాజ్యాంగంలోని 14, 15, 16 అధికరణలకు విరుద్ధమని గతంలో సుప్రీంకోర్టు స్పష్టం చేసిందని ఆయన కోర్టుకు గుర్తుచేశారు. రిజర్వేషన్ల పెంపునకు సామాజిక అధ్యయనం నిర్వహించాలని, అలాంటిదేమీ లేకుండానే ఎస్టీ రిజర్వేషన్లను పెంచడం, గ్రూప్-1 పోస్టుల్లో ఎస్టీలకు 10% రిజర్వు చేయడం చెల్లదని వాదించారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు విన్న జస్టిస్ అభినందకుమార్ షావిలి, జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు ధర్మాసనం.. గ్రూప్-1 నియామకాలు తమ తుది తీర్పునకు లోబడి ఉండాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేస్తూ తదుపరి విచారణను జూన్ 28కి వాయిదా వేసింది. జీవో 33పై సమగ్ర వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, పబ్లిక్ సర్వీస్ కమిషన్కు హైకోర్టు ఆదేశాలు జారీచేసింది.

**ఓఎంఆర్ విధానంలోనే ప్రిలిమ్స్ పరీక్ష**

గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షను ఆఫ్లైన్ విధానంలోనే నిర్వహించనున్నట్లు టీఎస్పీఎస్సీ ఇటీవల వెల్లడించింది. ప్రిలిమ్స్ పరీక్షను ఓఎంఆర్ విధానంలోనే నిర్వహించనున్నట్లు స్పష్టం చేసింది. ప్రకటించిన షెడ్యూలు ప్రకారం జూన్ 9న గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షను, అక్టోబర్ 21న మెయిన్స్ పరీక్ష నిర్వహించనున్నట్లు టీఎస్పీఎస్సీ ఇప్పటికే వెల్లడించింది. పరీక్షలకు వారం ముందు నుంచి హాల్టికెట్లను అందుబాటులో ఉంచుతారు. పరీక్ష సమయానికి 4 గంటల ముందువరకు హాల్టికెట్లు అందుబాటులో ఉండనున్నాయి.

తెలంగాణలో గ్రూప్-1 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ వెలువడిన సంగతి తెలిసిందే. మొత్తం 563 పోస్టుల భర్తీకి తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టిఎస్పిఎస్సి) ఫిబ్రవరి 19న నోటిఫికేషన్ విడుదల చేసింది. అభ్యర్థుల నుంచి ఫిబ్రవరి 23 నుంచి మార్చి 16న సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు స్వీకరించారు. గ్రూప్-1 పరీక్ష కోసం మొత్తం 4.03 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం ఇటీవలే ప్రభుత్వ ఉద్యోగాలకు వయోపరిమితిని 2 సంవత్సరాలకు పొడిగించిన సంగతి తెలిసిందే. దీంతో గరిష్ఠవయోపరిమితి 44 సంవత్సరాల నుంచి 46 సంవత్సరాలకు చేరింది. అయితే నిబంధనల మేరకు వయోపరిమితిలో సడలింపులు వర్తించనున్నాయి. రాష్ట్రప్రభుత్వ ఉద్యోగులకు 5 సంవత్సరాలు, ఎక్స్-సర్వీస్మెన్ అభ్యర్థులకు 3 సంవత్సరాలు, ఎన్సీసీ అభ్యర్థులకు 3 సంవత్సరాలు, ఎస్సీ-ఎస్టీ-బీసీ-ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 5 సంవత్సరాలు, దివ్యాంగులకు 10 సంవత్సరాల వరకు వయోసడలింపు ఉంటుంది.

# రేవంత్ రెడ్డి అప్పాయింట్‌మెంట్ లేకపోయేసారికి మోత్కుపల్లి నిరసనలు

### మొదటి పేజీ తరువాయి

కీర్తనలు, భజనలు చేశారు. అయితే ఆశించిన ఎమ్మెల్సీ దక్కక పోవడంతో తిరుగుబావుటా ఎగరేసి అదే కేసీఆర్‌ను నానా తిట్లూ తిట్టి బయటకు వచ్చారు. అటు తర్వాత కాంగ్రెస్‌లో చేరారు. ఇంకేముంది రేవంత్ సూరుడు వీరుడు అంటూ ఎన్నికలకుముందు తర్వాత కూడా పొగడ్తల వర్షం కురిపించాడు మోత్కుపల్లి. పాలన అద్భుతమని జనవరిలో ప్రత్యేక ప్రెస్‌మీట్ పెట్టి మరీ చెప్పారు. అయితే పార్ల మెంటు ఎన్నికల్లో తాను ఆశించిన స్థానం దక్కక పోయేసరికి తనకు రేవంత్ రెడ్డి అప్పాయింట్‌మెంట్ ఇవ్వక పోయేసరికి టంగ్ మార్చేశారు మోత్కుపల్లి. ఇప్పుడు ఏకంగా దీక్షలు, నిరసనలు చేస్తున్నారు. ఎందుకంటే రేవంత్ రెడ్డి మాదిగలకు అన్యాయం చేస్తున్నారని చెబుతున్నారు. ఏంటా అన్యాయం అంటే మూడు ఎస్సీ స్థానాలు(ఎంపీ) ఉన్నాయని ఒక్కటి కూడా మాదిగలకు ఇవ్వలేదన్నది మోత్కుపల్లి వారి ఆరోపణ. (ఇక్కడ ఆయన బాధ వేరేవారికి ఇవ్వలేదని కాదు..తనకు ఇవ్వలేదని అంటున్నారు కాంగ్రెస్ నేతలు) ఒక్క సీటును కూడా ఇవ్వని రేవంత్‌రెడ్డికి ఓటు తో బుద్ధి చెప్పాలని తాజాగా ఆయన మంద కృష్ణమాదిగతో కలిసి ఇందిరా పార్కు వద్ద చేసిన ఆందోళనలో వ్యాఖ్యానించారు. అంతేకాదు.. మాదిగలు కాంగ్రెస్‌కు ఓటేస్తే.. తనను చంపినట్టేనని అన్నారు. మాదిగలుగా పుట్టిన ఎవ్వరూ కూడా రేవంత్ వర్గానికి ఓటేయొద్దని మోత్కుపల్లి పిలుపునిచ్చారు. భారీ ఎత్తున మాదిగలను సమీకరించి.. మంద కృష్ణమాదిగను రంగంలోకి దింపి.. మోత్కుపల్లి చేసిన ఈ తతంగంతో కాంగ్రెస్‌కు నష్టమా? అంటే.. ఏమీ లేకపోతే.. ఆయన మరో కేఏ పాల్(ప్రజాశాంతి పార్టీ నేత)గా మారారని అంటున్నారు కాంగ్రెస్ నేతలు. ఎందుకంటే.. ఆయనకే దిక్కులేదు. సొంత జిల్లా నల్లగొండలోనే ఆయనను గుర్తించే నాయకులు లేరు. ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా మోత్కుపల్లిని పట్టించుకునేవారు ఎవరు? అనేది ప్రధాన ప్రశ్న. తన కోసం.. మాదిగలను వాడుకుంటున్నారనే విమర్శలు కాంగ్రెస్ నుంచి వినిపిస్తున్నాయని అంటున్నారు. కొసమెరుపు ఏంటంటే.. బీజేపీలోకి వెళ్లిపోవాలనేది మోత్కుపల్లివారి ఆలోచనట! అందుకే.. ఏదో ఒక వంక వెతుక్కున్నారని అంటున్నారు.

# విడుదలైన తెలంగాణ స్టేట్ ఎలిజిబిలిటీ టెస్ట్ నోటిఫికేషన్

### మొదటి పేజీ తరువాయి

ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ (టీఎస్‌సీహెచ్ఈ) చైర్మన్ ప్రొ.ఆర్.లింబాద్రి, ఉస్మానియా యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డి.రవీందర్ ప్రకటించారు. సెట్ పరీక్షలు ఆగస్టు 28, 29, 30, 31 తేదీల్లో నిర్వహించబడతాయి. మే 14 నుండి జూలై 2 వరకు దరఖాస్తులు స్వీకరించబడతాయి. జూలై 26 వరకు ఆన్‌లైన్ దరఖాస్తులను అపరాధ రుసుముతో సమర్పించవచ్చు. హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవడానికి అందుబాటులో ఉంటాయి. వెబ్‌సైట్ ఆగస్టు 20,2024 నుండి ప్రారంభమవుతుంది.

# 'సోషల్' వారు.. పార్టీల జోరు

### మొదటి పేజీ తరువాయి

దృష్టిలో పెట్టుకొని ప్రధాన పార్టీలు సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేపడుతున్నారు.

**సమాచారం.. వేగిరం**

మొబైల్లో ముఖ్యంగా వాట్సప్, ఫేస్ బుక్, ట్విట్టర్,ఇన్స్ స్టా గ్రామ్, ఆకౌంట్లు ఏర్పాటు చేసుకోని గ్రూపుల్లో సమాచారాన్ని వేగంగా చేరవేస్తున్నారు. అంతేకాక ఇతరుల నుంచి తెలుసుకుంటున్నారు. ప్రపంచం లో సంఘటనలు ఏ మూలన జరిగినా ఫొటోలు, వీడియోలు క్షణాల్లో వచ్చి చేరుతున్నాయి. పెద్దగా చదువురాని వారు సైతం సులభంగానే వాట్సప్, ఫేస్ బుక్ ను వినియోగిస్తున్నారు. ఈ ఎంపీ ఎన్నికల్లో వివిధ రాజకీయ పార్టీలు సోషల్ మీడియా ద్వారానే జోరుగా ప్రచారాలు సాగిస్తుండడం విశేషం.

**రాజకీయ నేతలే...**

రాజకీయ నాయకులు సోషల్ మీడియాను ఎక్కువగా వినియోగించుకుంటున్నారు. తమ పేరిట ప్రత్యేక సేవలు, గ్రూపులు ఏర్పాటు చేసుకొని తమ అనుచరులకు సమాచారాన్ని చేరవేస్తున్నారు. రకరకాల గ్రూపులు ఆసక్తికర మైన సమాచారంతో హల్చల్ చేయడం కనిపిస్తోంది.




**సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం...**

ఈ పార్లమెంట్ ఎన్నికల ప్రచారం ఎక్కువగా ఫేస్ బుక్, వాట్సఫ్, ఇన్స్ స్టా గ్రామ్, ట్వీట్టర్లలో జోరుగా కనిపిస్తుంది. ఎన్నికల్లో పోటీ చేస్తున్న పార్టీలు సోషల్ మీడియాను ఎక్కువగా వినియోగించుకుంటున్నారు. తమ కార్యక్రమాలను షేర్ చేస్తూ ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. క్షణాల్లో ఫొటోలు, వీడియోలతో సహ ప్రజల ముంగిటకు చేరవేస్తున్నారు. తమకు ఓట్లు వేసేల ప్రత్యేక గ్రూపులతో నేతలు ప్రచారంచేసు కుంటుండటం విశేషం.


**ప్రత్యేక గ్రూపులుగా ఏర్పడి...**

ప్రత్యేకంగా తమ గ్రామాల పేరిట, దోస్తులు, నాయకులు, కుటుంబాలు, బంధువులు తది తర తమ ఇష్టంవచ్చిన గ్రూపులు వాట్సప్, ఫేస్ బుక్, ట్విట్టర్, ఇన్స్టాగ్రాంను ఏర్పాటు చేసుకుని సమాచారాన్ని చేరవేస్తూ ఆనందం పంచుకుంటున్నారు. ఎంపీ ఎన్నికల్లో ప్రధాన పార్టీల కు చెందిన ముఖ్య నాయ కులు, సోషల్ మీడియా వారియర్ ను ఏర్పర్చుకొని ప్రచారం చేపడుతున్నారు.నల్లగొండ, భువనగిరి స్థానాల కు సంబంధించి అన్ని పార్టీల అభ్యర్థులకు గ్రూపులు ఉన్నాయి. నల్లగొండ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్ రెడ్డి, బిజెపి అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి, బిఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి కీ వాట్సాప్, ఫేస్ బుక్, ట్విట్టర్ ప్రత్యేక గ్రూపులు ఉన్నాయి. అదేవిధంగా భువనగిరి స్థానానికి సంబంధించి కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డి,బిఆర్ఎస్ అభ్యర్థి గ్యమ మల్లేష్, బిజెపి అభ్యర్థి బూర నర్సయ్య గౌడ్ లకు నియోజకవర్గంల రకరకాల గ్రూపులు, వాట్సప్, ఫేస్ బుక్ లు ఏర్పరుచుకోవడం.. ప్రచారం సాగిస్తుండటం విశేషం.

# భానుడి భగభగలతో అల్లాతున్న ములుగు ప్రజలకు ఉపశమనం

**జిల్లాలో పలు చోట్ల ఓ మోస్తారుగా చిరుజల్లులు**

ములుగు, మే 05 (తీన్మార్ న్యూస్): భానుడి భగభగలతో అల్లాడి పోతున్న ములుగు జిల్లా ప్రజలకు కొంత ఉపశమనం కలిగింది. ఆదివారం జిల్లాలో పలు చోట్ల ఓ మోస్తారుగా చిరుజల్లులు కురిశాయి. ఇన్ని రోజులు ఎండ తీవ్రతో ఇబ్బందులు పడ్డ ప్రజలు చిరు జల్లులతో ఊపిరి పీల్చుకున్నారు. ముఖ్యంగా ఏటూరు నాగారం మండల కేంద్రంలో గాలి దుమారంతో కూడిన భారీ వర్షం కురిసింది. గాలి వేగానికి పలుచోట్ల ఇండ్ల పైకప్పులు ఎగిరిపోయాయి. అకస్మాత్తుగా కురిసిన వర్షంతో పలుచోట్ల పంటలు దెబ్బతిన్నాయి. కాగా, రాగల ఐదురోజులో తెలంగాణలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాపాతం నమోదయ్యే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది.





# మంత్రి పొన్నం ప్రభాకర్‌పై బీజేపీ నేత మురళీకృష్ణ ఎన్నికల అధికారికి ఫిర్యాదు

**హిందువుల మనోభావాలను కూడా దెబ్బతీసేలా మాట్లాడుతున్నారని పిర్యాదు**

కరీంనగర్, మే 05 (తీన్మార్ న్యూస్): ఎన్నికల నియమావళికి విరుద్దంగా వ్యవహరిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్‌పై చర్యలు తీసుకోవాలని బీజేపీ నేత కొట్టె మురళీకృష్ణ కరీంనగర్ ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల అధికారికి లేఖ పంపారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ ఓ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో, ప్రచార సభలో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌పై నిరాధార అనుచిత వ్యాఖ్యలు చేశారని ఫిర్యాదులో తెలిపారు. వెధవ, సమాధి చేస్తామంటూ వ్యక్తిగత దూషణలతో అవమానకర పదజాలంతో పొన్నం ప్రసంగాలు చేస్తున్నారని ఆరోపించారు. హిందువుల మనోభావాలను కూడా దెబ్బతీసేలా మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. బండి సంజయ్‌పై కార్పొరేటర్‌గా ఉన్న సమయంలో సానిటేషన్ కార్మికుల వద్ద డబ్బులు తీసుకున్నారంటూ నిరాధారమైన కల్పిత ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. కరీంనగర్ జిల్లా నియోజకవర్గ ప్రజలను గందరగోళపరచి అయోమయానికి గురి చేసేలా ప్రభావితం చేస్తున్నారని ఎన్నికల అనుబంధాలకు విరుద్ధంగా వ్యక్తిగత ఆలోచన రాష్ట్ర మంత్రి ఉన్న ప్రభాకర్ పై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఎన్నికల నియమావళి నిబంధనలకు విరుద్ధంగా



వ్యవహరిస్తున్న పొన్నం ప్రభాకర్ పై ఎన్నికలు ముగిసే వరకు ప్రసంగాలు ఇంటర్వ్యూలు ఇవ్వకుండా నిలుపుదల చేయాలని కోరారు.

# కాంగ్రెస్ పాలన కొనసాగేలా లేదని కెసిఆర్ వాఖ్యలు

**ఎన్నికలు ఎప్పుడొచ్చినా బీఆర్ఎస్ సర్కారే వస్తుందని ధీమా వ్యక్తం**

తెలంగాణ బ్యూరో, మే 05 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో కాంగ్రెస్ పాలన చివరి దాకా ఉండేలా లేదని మధ్యలోనే ఎన్నికలు వచ్చే అవకాశం ఉందని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కరీంనగర్ లో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జిల్లాలో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్లో కాంగ్రెస్, బీజేపీ పార్టీలపై కేసీఆర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా మళ్లీ మన సర్కారే వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో నీళ్లిచ్చినం, కరెంట్ ఇచ్చినం, రైతు బంధు ఇచ్చినం, పంట కొన్నామని తెలిపారు. హుజురాబాద్ దళితులు ఆత్మ గౌరవంతో ఉన్నారని ఉద్ఘాటించారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో రేవంత్రెడ్డి మాయ మాటలు నమ్మారని అన్నారు. రాజకీయాల్లో గెలుపు, ఓటములు సమస్య కాదని అన్నారు. పంట వేసేటప్పుడు రైతు బంధు ఇస్తారా, పంట కోసేటప్పుడు ఇస్తారా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో రూ. వెయ్యి కోట్ల కంపెనీ మద్రాస్ పోయిందని మండిపడ్డారు. నాలుగైదు నెలల్లోనే రేవంత్ ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత వచ్చిందని అన్నారు.



తమ హయాంలో పోని కరెంట్ ఈ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎందుకు ఉండట్లేదో ఆలోచించాలని చెప్పారు. గోదావరి నీళ్లు పోతే తెలంగాణకు బతుకే లేదని కేసీఆర్ అన్నారు. ప్రధాని నీళ్లను పక్క రాష్ట్రాలకు తీసుకెళ్తానంటే సీఎం రేవంత్రెడ్డి ఎందుకు ప్రశ్నించట్లేదని అన్నారు. కరీంనగర్ను బండి సంజయ్ ఏం అభివృద్ధి చేశారని ప్రశ్నించారు. ఆయన ఎంపీ అయ్యాక జిల్లాకు ఏం ఒరగలేదని విరుచుకుపడ్డారు. లోక్సభ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులకు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

# బీజేపీని నమ్మి ఓటేస్తే ఇగ ఆగమే

**ప్రజలను హెచ్చరించిన బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



తెలంగాణ బ్యూరో, మే 05 (తీన్మార్ న్యూస్): పెట్రోల్ ధరలతో కాషాయపార్టీ ఇప్పటికే నడ్డి విరుస్తున్నదని, అబ్ కా బార్.. చార్ సౌ పార్ అంటున్న బీజేపీని నమ్మి ఓటేస్తే ఇగ ఆగమేనని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. వాళ్లు చార్ సౌ అనేది సీట్ల గురించి కాదని, పెట్రోల్ రేట్ల గురించని ఆయన చమత్కరించారు. ఈ మేరకు కేటీఆర్ తన ఎక్స్ ఖాతాలో ఒక పోస్టు పెట్టారు. ఆ పోస్టుకు నవ్వుతున్న ఎమోజీని జతచేశారు. అదేవిధంగా 2014లో రూ.70 గా ఉన్న పెట్రోల్ ధర 2024 నాటికి రూ.110 కు చేరిందని అంకెలతో సూచించారు. బీజేపీకి 400 సీట్లిస్తే 2029 నాటికి లీటర్ పెట్రోల్ ధర రూ.400 కు చేరుతుందేమోనని ఆ అంకెలతోనే అనుమానం వ్యక్తంచేశారు. ఈ పోస్టుకు బీఆర్ఎస్ పార్టీ లోక్‌సభ ఎన్నికల కోసం చేసిన యాడ్‌ను కేటీఆర్ జతచేశారు. కేంద్రంలో బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే పెట్రోల్ ధర రూ.400 కు చేరుతుందన్నట్లుగా బీఆర్ఎస్ పార్టీ ఆ అడ్వర్టయిజ్‌మెంట్‌ను చేయించింది.

# రైతుబంధు సాయం ఎప్పుడు ఇచ్చేది: కెసిఆర్

### మొదటి పేజీ తరువాయి

అంటున్నడు. పంటలు వచ్చి జోకుతున్నరు ఓ దిక్కు. నాటేటప్పుడు ఇస్తరా.. ? జోకేటప్పుడు ఇస్తరా..? ఎంతపాటి పరిపాలన అంటూ విమర్శించారు. జాతీయ స్థాయిలో, అంతర్జాతీయ స్థాయిలో కష్టపడి రాష్ట్రం గౌరవం పెంచినం. ఐటీ, పరిశ్రమల రంగంలో బ్రహ్మాండంగా తెలంగాణకు పెట్టుబడులు వస్తుండే. నరేంద్ర మోదీ కూడా అసూయపడేంత పెట్టుబడులు వస్తుండే. ఇవాళ రూ.1000కోట్ల పెట్టుబడి పెట్టే కంపెనీ తమిళనాడు రాష్ట్రానికి వెళ్లిపోయింది. ఇవాళ చూస్తే అల్యూమినియం, ప్లాస్టిక్ ఇండస్ట్రీకి ప్రభుత్వం కరెంటు కోతలు పెడుతున్నది. రోజుకు ఐదారుసార్లు ట్రిప్ అవుతున్నది. మధ్యలో పని ఆగిపోయి పెదవి విరుస్తున్నరు. ఇగ తెలంగాణలో లాభంలో లేదు వెళ్లిపోవాలనుకుంటున్నారని పేపర్లలో వార్త వచ్చింది. నాకు చాలా దుఃఖం కలిగింది. నాలుగైదు నెలల్లో దుర్మార్గులు ఎంత పని చేసిరి. ఎంతమంచిగున్న తెలంగాణ ఎట్ల ఆగమైపాయే. ఇది ఎట్లా అని చాలా బాధపడ్డ. ఈ బాధ నివారణ కావాలి' అన్నారు. 2001లో తెలంగాణ జెండా ఎత్తిన నాడు హుజూరాబాద్ గడ్డ. ఆ నాడు పెద్ద నాయకులు లేకపోయినా జడ్పీటీసీలు, ఎంపీపీలను గెలిపించిన గడ్డ హుజూరాబాద్ గడ్డ. 2001 ఫలితమే మనకు తెలంగాణ వచ్చింది. తెలంగాణ ఉద్యమం అయిపోలేదు.. ఇంకా ఉన్నది. తెలంగాణ పునర్నిర్మాణ ప్రక్రియ ముందున్నది. మన బాధ్యత పూర్తవలేదు. అందుకోసం అందరినీ కోరేది ఒకటే. నాలుగైదు నెలల్లోనే ప్రజల నుంచి ఇంత వ్యతిరేకత తెచ్చుకున్న ప్రభుత్వం.. కొసముట్టే ప్రభుత్వం కాదు. రెండోది వందశాతం నేను మీకు చెబుతున్నా.. నా మాటమీద విశ్వాసం ఉంచండి. మళ్లీ ఎప్పుడు అసెంబ్లీ ఎన్నికలు వచ్చినా మధ్యలో వచ్చినా.. చివరకు వచ్చినా ఎప్పుడు వచ్చిన మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ గవర్నమెంటే. అందులో ఎవరికీ అనుమానం లేదు. వందశాతం వస్తుంది. మనం పనిచేసేది బాకీ ఉన్నది. ఇంకా చాలా మంచి జరగాల్సిన అవసరం ఉన్నది. 365 రోజులు నీళ్లు రావాల్సిన అవసరం ఉన్నది' అన్నారు.

# పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కు వినియోగానికి సాధారణ సెలవు మంజూరు

తెలంగాణ బ్యూరో, మే 05 (తీన్మార్ న్యూస్): ప్రభుత్వ ఉద్యోగులకు ఎన్నికల సంఘం శుభవార్త వినిపించింది. పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కు వినియోగించుకోవడానికి వీరికి ప్రభుత్వం అవకాశం కల్పించిన విషయం తెలిసిందే. దీనికోసం ప్రత్యేకంగా ఒకరోజు సాధారణ సెలవు మంజూరు చేశారు. ఈమేరకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్ కుమార్ మీనా ఉత్తర్వులు జారీచేశారు. ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రాలలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ప్రభుత్వ ఉద్యోగులు ఓటు వేయవచ్చు. ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగుల అభ్యర్థన మేరకు సంబంధిత అధికారులు ఒకరోజు ప్రత్యేక క్యాజువల్ సెలవును మంజూరు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం సూచనల మేరకు సెలవు ప్రకటించారు. ఉత్తర్వులకు తగినట్లుగా వివిధ విభాగాల అధిపతులు, జిల్లా కలెక్టర్లు, సెక్రటేరియట్ విభాగాలవారు తగిన చర్యలు తీసుకోవాలని సీఈవో సూచించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ఏ ఉద్యోగీ తన ఓటు హక్కును కోల్పోకూడదని, విధులు నిర్వహించే ప్రతి ఉద్యోగికి పోస్టల్ బ్యాలట్ ఇవ్వాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపైనే ఉంది. ఇదే విషయాన్ని ఏపీ జేఏసీ అమరావతి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బొప్పరాజు వెంకటేశ్వర్లు, దామోదరరావు స్పష్టం చేస్తున్నారు. ఎన్నికల విధులకు నియోజకవర్గాల వారీగా ఎంతమంది సిబ్బందిని కేటాయించారో స్పష్టమైన సమాచారం లేదన్నారు. ఏప్రిల్ 30న ఎన్నికల విధుల్లోకి తీసుకున్న అంగన్‌వాడీ, కాంట్రాక్టు ఉద్యోగులకు పోస్టల్ బ్యాలట్ అందేలా ఈసీ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అవసరమైతే గడువు పెంచాలని ఈసీని ఉద్యోగ సంఘ నేతలు కోరుతున్నారు. దాదాపు 3 వేల మందికి పైగా సర్వీసు ఓటర్ల కోసం పోస్టల్ బ్యాలెట్ ప్రవేశపెడుతున్నారు. వీరికి ఆన్‌లైన్ ద్వారా బ్యాలెట్ పత్రాలు పంపుతారు. వీరి కోసం రెండు బ్యాలెట్ పత్రాలు సిద్ధమయ్యాయి. లోక్ సభకు ఒకటి, అసెంబ్లీకి మరొకటి ఉంటుంది. ఆన్ లైన్ లో వీటిని డౌన్ లోడ్ చేసుకొని ఓటు హక్కు వినియోగించుకొని వీటిని జాగ్రత్తగా ప్రత్యేక కవరులో పోస్ట్ బాక్స్ లో వేయాలి. అవి రిటర్నింగ్ అధికారికి చేరతాయి.